# అనుకూల దాంపత్యము

శ్రీ వాగంటి
శక్తీశ్వరరావు

మోహన్ చిన్నతనమునుండి తల్లిదండ్రులవద్ద కడు గారాబముగా పెరిగిన బిడ్డ. పెద్ద ధనవంతుని కుటుంబములోనివాడు. ఉదార స్వభావముగలవాడు. అందమైనవాడు. విలాసపురుషుడు. సంగీతము నృత్యము కవిత్వము చిత్రలేఖనము వీట్లయందుగల అభిలాష వర్ణనాతీతము. ఇతను చిన్నవయసులోనే 6 వ ఫారం ప్యాసుఅయి మిత్రబృందములోను, బంధువర్గములోను, స్కూలు అధికారులతోను గౌరవ మర్యాదలతో మెలంగుచు మంచిపేరు సంపాదించి వారి ప్రేమకు పాత్రుడయ్యెను. పిమ్మట మదరాసు ఇండియన్ మెడికల్ స్కూలులో చేరినాడు. ఆసుపత్రిలో సర్జికల్ రూమ్‌లో యతనిని అధికారులు నియమించిరి. ఆ రూమ్‌లో నియమింపబడినవారిలో కమల అను విద్యార్థిని ఒకతె. మోహన్ మాటలలోను చదువులోను చేష్టలలోను తెలివిగలవాడని అతని స్నేహితులు అధికారులు చెప్పుకొనుచుండగా విన్నది కమల. సమయము చేజిక్కినదని పొంగిపోయినది. మోహన్ చేతులు కడుక్కొను సమయము కనిపెట్టి మోహన్ చేతులకు తన చేతులు తాకించుచు కమలకూడ చేతులు కడుగుకొనుట ప్రారంభించినది. ఈడు జోడు బాగుగానే యున్నదని తలంచి సంతసించినది. మోహన్ మీద నిట్టూర్పులు ఒకటివెనుక ఒకటి విసరివేశింది. ఇట్లు కొంతకాలము గడచినది. మోహన్ వొంటరిగానుండు సమయము చూచి యతనితో యిష్టాగోష్ఠిగా సంభాషణ ప్రారంభించింది. లెక్చరుకొడుతోంది అదో ధోరణిగా. ఆ సమయములో తన కోర్కెను, అభిప్రాయమునుకూడ చల్లగా జారవేసింది. వీరిద్దరికి రోజురోజు ప్రేమ అధికమయింది. ఒక క్షణకాలమైనను ఒకరినొకరు విడువలేని యవస్థ కలిగింది. విలాసముగా నిద్దరు కాలక్షేపము చేయుచుండిరి. వేసంగిశెలవలు ఇచ్చుటచేత మోహన్ విశాఖపట్టణము వెడలెను. అక్కడ తన స్నేహితులతో కమలను జ్ఞాపకముచేసుకొని కాలక్షేపము చేయుచుండెను. ఒకరోజున బీచిరోడ్డుమీద మిత్రులతో కలసి షికారు వెళ్లుచుండగా మోటారులో ఒంటరిగా పోవుచున్న ఒక స్త్రీ ఇతనిని చూచి వేగం తగ్గించి మెల్లగా పోవుచుండెను. మోహన్ అతని స్నేహితులు యిసుక తిప్పమీద కూర్చుండి నటీనటులను గూర్చి విమర్శించుచుండిరి. మోటారు ఆపి ఆ స్త్రీ వారిని సమీపించి పరిచయమున్నదానివలె వారితో వాదించుట మొదలుపెట్టింది. ఆమె వాదన మెచ్చుకొని మోహన్ ఇట్లనెను.

మోహన్:—(ఆమెవైపుచూచి) అమ్మా నీ పేరు ఏమి ?

స్త్రీ,—సరోజిని.

మోహన్:—(తనలో) యీమె మిక్కిలి సుకుమారివలె నున్నది. బాగుగా చదువుకొన్న స్త్రీవలె నున్నది. యీమె వృత్తాంతము నడిగి తెలుసుకొనెదగాక.

మో!—(బిగ్గరగా) అమ్మా ! సరోజినీ నీ తల్లిదండ్రులెవ్వరు ?

స!—నా తండ్రి నారాయణరావుగారు. తల్లిలేని అభాగ్యురాలను.

మో:—(తనలో) ఓహో ! యీమె యొక లక్షాధికారి బిడ్డయా ?

(బిగ్గరగా) సరోజినీ, నీవేమి చదివితివి ?

స:—యింటరుమిడియేట్ చదివితిని.

మోహన్‌కు క్రొత్తమైత్రి కలసినది. సరోజిని మోహన్ స్నేహితులు ఆటపాటలతో కాలక్షేపము చేయుచుండిరి. సరోజినికి పుట్టినరోజు పండుగ అగుటచే మోహనును—స్నేహితులను టీపార్టీకి ఆహ్వానించెను. అంతట వారు టీపార్టీకి ఆమె సౌధమున కరుదెంచిరి. సరోజిని టీపార్టీ అయినపిమ్మట వీణమీద త్యాగరాజ కృతులు పాడుట ప్రారంభించినది.

మో:—(సంతోషముతో) సరోజా ! నీవింతగొప్ప పాటకురాలవని ఎన్నడు వినియుండలేదు. 5 గం॥లు అయినది. షికార్ వెళ్లుదమా ?

స:—ఆ ! వెళ్లవద్దా ? మరి— అందరూ షికారు వెళ్ళిరి. ఆ మరుసటిదినమున 11 గం॥లకు కవరు అందజేసాడు పోస్టువాడు. మోహన్ వెంటనే మద్రాసు

ప్రయాణము నిశ్చయించి సరోజినికై కబురుపంపినాడు. ఇంటికి రావలసినదని. సరోజినీ! మోహన్ ఇంటికివెళ్లి మోహన్ ప్రయాణముసంగతి వింది. తన ప్రేమను తెలిపింది.

మో:—సరోజా! నా సోదరివంటిదానవు. నీవు వృద్ధిలోనికిరానల సిదానవు. అన్యధా భావింపకు. క్షమించుము".

అసమ్మతి తెలిపినందుకు మనస్సులో బాధపడి నిరాశ చెందినది సరోజిని. ఇద్దరూ స్టేషన్‌కు వెళ్ళిరి. మోహన్ తన స్నేహితులను స్టేషన్‌లో కలసికొనెను. మోహన్ రైలులో ప్రవేశించెను. రైలు కదిలింది. స్నేహితులు సరోజిని రైలు కనబడువరకు చూచి స్టేషన్ విడిచిరి. మోహన్ మద్రాసు చేరెను. సెంట్రల్ స్టేషన్‌లో కమలను కలసుగొని గదికి చేరెను. రెండవ రోజున మోహన్ కమల కాఫీ త్రాగినపిమ్మట మోహన్ పేపరులో; మోటారుప్రమాదం విశాఖపట్నం అను వార్తను ఈ విధముగా చదివెను. "నారాయణ రావుగారి కుమార్తె సరోజినియొక్క మోటారు చెట్టునకు డీకొని బలవత్తరమైన గాయములు తగులుటచె రాత్రి 10 గంటలకు ఆసుపత్రిలో మరణించెను.

ఇట్లు
విలేఖరి

ఈ భయంకరమైన వార్తను చదివి ఉల్లిక్కిపడెను.

కమల:—(బెదరి) మోహన్! పేపరు విశేషములు ఏమిటి? నీ ముఖము వాడినది. యెన్నడులేని కన్నీరు విడుచుచున్నావు" చెప్పవూ?

మోహన్ సరోజిని ప్రమాదం తెలిపి అతనకును ఆమెకుగల మైత్రి తెలుపగా ఇద్దరూ చాలాసేపు విచారించి ఆమె ఆత్మశాంతికై దేవుని స్మరించిరి. కొంతకాలము గడచినపిదప మోహన్! తండ్రిగారివద్దనుంచి వచ్చిన వుత్తరమును ఈ విధముగా చదువుకొనెను.

మోహన్:—నీకు గొప్ప పెండ్లిసంబంధము కుదిరినది. పెద్దలు సుభముహూర్తమును నిశ్చయించిరి. నీ మిత్రులతో రావలెను.

ఇట్లు
మాధవరావు

ఈ సంగతి కమలకు తెలియజేసాడు.

కమల:—మోహన్! నీ తండ్రిగారి వుత్తరం బాగున్నది. కాని మన మిద్దరము అన్యోన్యముగా ప్రేమించుకొంటిమి. నన్ను ద్రోహముచేసెదవా? లేక! మన ప్రేమను పాలించెదవా? నీదేభారం" సుమా? అని దీనముగా అడిగింది.

మో:—కమలా! నిన్ను ద్రోహంచేసెదనా? ఫరవాలేదు. మన ప్రేమజ్యోతియే దీర్ఘకాలమువరకు వెలుంగగలదు. భయపడకు". అని వాగ్దానము చేసినాడు.

మాధవరావుకి వుత్తరంచేరినది:—

తండ్రీ!

మీ వుత్తరం అందినది సంతోషమేగాని ఒక మనవి. నే నొకస్త్రీని ప్రేమించితిని. నన్ను ఆమె ప్రేమించింది. మా మనస్సులు ఇదివరకే ఒకరియందు ఒకరికి లగ్నమైనవి. అట్టి పవిత్రప్రేమను భంగపర్చకండి. మా కిద్దరికి వివాహముచేయండి లేనిచో మీ ప్రయత్నములు మాని నా జీవితములో వివాహములేదని భావింపుడు.

చిత్తగించవలెను
ప్రియపుత్రుడు, మోహన్

మాధవరావుగారు ఉత్తరము చూచుకొని ఒక సుభముహూర్తమున కమలా మోహన్‌లకు వైభవముగా వివాహము జరిపిరి. నూతన దంపతులకు మద్రాసులో చదువు ముగిసినది. ఇద్దరూ మునిసిపల్ ఆసుపత్రులలో ఉద్యోగములలో చేరి బీదరోగులను అన్నివిధముల కాపాడుచు ఒకరి కొకరు సాయపడుచు కీర్తిగాంచి వచ్చిన జీతములతోనే హాయిగా పేరుప్రఖ్యాతులతో జీవయాత్ర సల్పుచుండిరి.

## కథకులకు మనవి

కథాంజలికి కథలు పంపేవారు రెండు పుటలకు ఎక్కువలేకుండా వుండేలాగ చూడాలి. కథలుతప్పవ్యాసాలు ప్రకటింపబడవు. కథలు సమాజజీవనానికి సంబంధించినవిగా వుండాలి. సీరియల్ కథలు వేయబడవు. —మేనేజరు.